# నైట్ డ్యూటీ

డా॥ కె. రవీంద్రబాబు




**రంగారావుకు** హౌస్ సర్జనుగా మొదటి నైట్‌డ్యూటీ ఆ రోజు. కొత్త చెప్పు కరచినట్లు బాధ పెడుతుంది మొదటి డ్యూటీ అని సీనియర్, రూంమేటు రజని చెప్పాడు. కొన్ని వందల మంది సర్జికల్ ఇన్ పేషంట్సులో రాత్రి ఎవరికి, ఏ బాధ కలిగినా రంగారావే జవాబు చెప్పాలి. ఎవరికి, ఏం ప్రమాదం వచ్చినా వెళ్ళి చూడాలి. ఏదయినా అర్జంటు కేసు వస్తే ఆపరేషన్ చేసేప్పుడు అసిస్ట్ చేయాలి. డ్యూటీ మొదలయిన దగ్గర నుండి ఉక్కిరిబిక్కిరి అయే పని భారంతో భూభాగం మోసే వాసుకిలా కుంగి పోసాగాడు రంగారావు.

అన్ని వార్డులూ ఒకసారి కలియ తిరిగాక రాత్రి తొమ్మిది గంటలు కావస్తుండగా అసిస్టెంట్ సర్జన్ హనుమంతరావుతో కాంటీన్‌కు వెళ్ళాడు భోంచేయడానికి.

తిరునాళ జరిగిన మరు రోజు సంత ప్రదేశంలా కాంటీను వెల వెలా పోతున్నది.

నిద్ర ముంచుకొస్తున్న కళ్ళతో సర్వరు అడుగూ బొడుగూ తెచ్చి ప్లేట్లలో గుమ్మరిస్తున్నాడు.

బకాసురుడిలా ఆరిపోయిన పదార్థాలను ఆవురావురుమని తింటున్న రంగారావు వంక విస్మయంగా చూశాడు హనుమంతరావు.

"ఇవాళ మొదటి డ్యూటీ కాబోలు" అన్నాడు హనుమంతరావు.

"అవున్సార్! నడుం విరిగిపోతూంది. కాళ్ళు ఒకటే సలుపుతున్నాయి పరిగెట్టలేక. ఒక్క రోజుకే ఇలా ఉంది. మరి సంవత్సరమంతా ఎలా వెళ్ళించాలో" సముద్రాన్నెలా ఈదాలో అని ఒడ్డుకు వస్తున్న అలలు చూసి భయపడుతున్న నావికునిలా సమాధానమిచ్చాడు రంగారావు.

"మొదటి రోజున అలాగే ఉంటుంది. క్రమంగా అలవాటయిపోతుంది. నిన్ను చూస్తే నాకు నా మొదటి నైట్ డ్యూటీ జ్ఞాపకం వస్తూంది." కుర్చీలో సర్దుకు కూర్చుని సిగరెట్ తీసి ముట్టించాడు. సిగరెట్ పెట్టె రంగారావు వైపు నెట్టాడు. రంగారావు సిగరెట్ తీసుకోకపోయేసరికి "పరవాలేదు తీసుకో సిగరెట్—నో ఫార్మాలిటీస్" అన్నాడు.

"నా కలవాటు లేదు, సార్" అన్నాడు రంగారావు.

"ఈ రోజుల్లో సిగరెట్ తాగని మగాడూ, సెక్స్ పుస్తకాలు చదవని ఆడపిల్లా ఉంటారంటే నమ్మడం కష్టం" అన్నాడు హనుమంతరావు

"నా మొదటి డ్యూటీ రోజున ఏమైందనుకున్నావు?" పక్క పలుకు నోట్లో వేసుకొంటూ మొదలెట్టాడు. ఇరవై నాలుగ్గంటలూ తెరచి ఉంచే కాంటీన్ ఖాళీగా, నిశ్శబ్దంగా ఉంది అప్పుడు.

● ● ● ●

నేను మద్రాసు మెడికల్ కాలేజీ విద్యార్థిని. హౌస్ సర్జన్‌గా అక్కడే జనరల్ హాస్పటల్‌లో చేరాను. అప్పుడు మెడికల్ కాలేజీల్లో సీట్లు ఇప్పుడున్నవి కావు. ఉప్మాలో జీడి పలుకుల్లా హౌస్ సర్జన్లు తక్కువే—ఇప్పటి కాలంతో పోల్చుకొంటే!

మొదటి రోజు నైట్ డ్యూటీకి వచ్చిన దగ్గర్నుండి అర్ధరాత్రి వరకూ ఒకటే హైరాన పడి వార్డుల చుట్టూ తిరగవలసి వచ్చింది. అర్ధరాత్రి అయ్యేసరికి మంచం మీద నడుం వాల్చాను. అర సెకండులో నిద్ర పట్టింది. ఎంతసేపు నిద్రపోయానో తెలియదు గాని, మెమో బోయ్ కేకలకు ఉలికిపడి లేచాను. ప్రమాదంగా ఉన్న కేసు చూడడానికి వార్డుకు రమ్మని సిస్టర్ ఫ్లారెన్స్ వ్రాసిన మెమో చేతికిచ్చాడు.

బద్ధకం క్షణంలో పోయింది. కొత్త బిచ్చగాడు పొద్దెరగడని, గభాలున లేచి షైట్ మెడ్రో వేసుకొని పరుగులాంటి నడకతో మెమో వచ్చిన వార్డుకు వెళ్ళాను.

డ్యూటీ నర్సు ఫ్లారెన్సు ఆంగ్లో ఇండియన్. ఆంగ్లో ఇండియన్ నర్సులు నీటుగాను, చురుగ్గానూ ఉండి పని చకచక చేసుకుపోతారని విన్నాను. ఫ్లారెన్సును చూశాక నేను విన్నది నిజమేనని తెలుసుకొన్నాను.

వార్డులో బాధ పడుతున్న రోగికి తగు వైద్యం జరిగాక తిరిగి రాబోతుంటే "ఒక్క నిమిషం ఉండండి, డాక్టర్" అంది.

ఆ వార్డు ఆస్పత్రిలో ఒక మూలన ఉంది. నే నిచ్చిన మార్ఫిన్ ఇంజక్షన్‌తో బాధ పడుతున్న రోగి మూలుగు ఆపి నిద్ర పోతున్నాడు. ఇతర రోగులంతా అదివరకే నిద్రలో ఉన్నారు. వార్డులో లైట్లు చాలాభాగం ఆప్ చేయటంతో మసక వెలుగుగా ఉంది. మెమోబాయ్ వరండాలో బల్ల మీద గురక పెడుతున్నాడు.

"మొదటి డ్యూటీనా, డాక్" అంది స్టయిల్‌గా నర్సు ఫ్లారెన్స్. చక్కటి ఇంగ్లీషు ఉచ్చారణ ఆమెది.

అవు నన్నాను. నేను ఇంగ్లీషులో చక్కగా మాట్లాడగలగటం ఒక ప్లస్ పాయింట్ అనిపించింది ఆ క్షణంలో నాకు.

కొద్దిసేపు ఆ మాటా ఈ మాటా చెప్పాక ఫ్లాస్కులో టీ తెచ్చి కప్పులో పోసి ఇచ్చింది. మొగమాట పడుతూ టీ చప్పరిస్తూ కూర్చున్నాను.

నేను చక్కటి ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది అన్నది.

ఈ రోజుల్లో ఇంగ్లీషు వాక్యంలో నాలుగు తప్పులు లేకుండా మాట్లాడే డాక్టరు కనపడటం లేదంది.

నేను బహుశా ఇంగ్లీషు కాన్వెంట్‌లో చిన్నప్పుడు చదివి ఉండవచ్చును అని అనిపిస్తోం దంది.

"లేదు" అన్నాను.

"అయితే ఇంగ్లీషు నవలలు ఎక్కువగా చదివే అలవాటు ఉండి ఉంటుంది" అంది.

అవు నన్నాను.

"హెరాల్డ్ రాబిన్స్ నవలలంటే నాకెంతో ఇష్టం. తిండి, నిద్ర లేకపోయినా పరవాలేదు కాని ఆమె నవలలు లేనిది బ్రతకలేను. నా స్టయిపెండులో ఎక్కువ భాగం ఆమె లేటెస్టు నవలలు కొనడానికి ఖర్చు పెడతాను" అంది.

ఎలిజబెత్ టేలర్ నటించిన ఐవన్‌హో సినిమా దగ్గర నుండి విక్టర్ హ్యూగో నవలల వరకూ అనేక విషయాల గురించి మాట్లాడుకొన్నాము.

ఏదో మరచి పోయినట్లు క్షణంలో నగం సేపు తల మీద చేయి ఉంచుకొని ఆలోచించింది ఫ్లారెన్స్. కబోర్డు నుండి సిగరెట్ టిన్ బయటకు తీసి ఒకటి నాకు అందించింది.


అప్రయత్నంగానే నోట్లో పెట్టుకొన్నాను. అలా ఎందుకు చేశానో ఇప్పటికీ చెప్పలేను. ఎందుకంటే అప్పటివరకూ నేనెప్పుడూ సిగరెట్ కాల్చలేదు సిలాగే.

నా పెదవుల మధ్య ఉన్న సిగరెట్ కొనను అగ్గి పుల్ల వెలిగించి ముట్టించింది.

ఆమె వెలిగించింది అగ్గిపుల్ల కాదు మన్మథబాణం.

ఆమె రగిలించింది సిగరెట్‌ని కాదు, నా మనసులో అణగారి ఉన్న కోర్కెలను.

ఆ రాత్రి కొత్తగా సిగరెట్ తాగటం కాక




ULKA-RP-1-82-TEL

ఇంకా కొన్ని అనుభవాలు కొత్తగా పొందాను అవి నేను మీకు చెప్పక్కర్లేదనుకొంటాను.


ఎంత కాలం అలా గడిచిపోయిందో తెలియదు. కాలం ఎప్పుడూ ఒకే విధంగా నడవదంటారు. ఒక్కోసారి క్షణం యుగంగానూ, యుగం క్షణంగానూ గడిచిపోతుందని చెప్పే మాటల్లో అర్థం బోధపడ్డది అప్పుడే నాకు.

రోగి ఎవరో బాధతో మూల్గుతుంటే మళ్ళీ ఈ లోకంలోకి వచ్చాను.

ఇంతలో మరో వార్డు నుండి మెమో చీటీతో మెమో బాయ్ రావడంతో అయిష్టంగానే కదలి వెళ్ళవలసి వచ్చింది.

కొత్త అనుభవాల తాలూకు తీపి భావనలు మనసును ముంచి వేస్తుంటే కదలలేక కదలలేక కదులుతున్న శరీరాన్ని తడబడే అడుగులతో ఎలాగో మెమో వచ్చిన వార్డు దగ్గరకు చేర్చాను.

ఆ వార్డు దగ్గర నుండి మరో వార్డుకు వెళ్ళవలసి వచ్చింది. వార్డు నుండి వార్డుకు అనుల




దారంలా తిరుగుతుంటే లోపల తెల్లవారి పోయింది.

రోగుల తాలూకు బంధువులు సూర్య కిరణాలతో పాటు హాస్పిటల్ వార్డులు నింపేశారు.

ఆవరణలోని పక్షుల రొద మించిన గోల మొదలయింది వార్డుల్లో!

నైట్ డ్యూటీ నర్సులు క్వార్టర్సుకు బయలు దేరడం మొదలెట్టారు. పగలు డ్యూటీ నర్సులు ఒక్కొక్కరే తాపీగా సరసు నుండి బయటకు వస్తున్న హంసల్లా తెల్ల దుస్తుల్లో మెరసిపోతూ క్వార్టర్సు నుండి వచ్చి ఒకో వార్డుకీ వెళుతున్నారు.

స్వీపర్లూ, వార్డు బాయ్‌లూ అటూ ఇటూ తిరుగుతూ హడావిడి పడుతున్నారు.

డ్యూటీ రూమ్‌లోకి వెళ్ళబోతూ—"హై డాక్" అన్న మాటలు విని టక్కున ఆగి పోయాను.

దూరాన చేయి ఊపుతూ వెళ్ళిపోతున్నది ఫ్లారెన్స్.

ఆమెను చూడగానే మధుర స్మృతులు మనసులో నాట్యం చేయసాగాయి. పిరుదుల కదలికకు ఎగిసి పడే ఆమె యూనిఫార్మ్ ముడతలు లయ విన్యాస మొనర్చే శ్వేత కపోతాల జంటగా కనపడ్డాయి—నా కామెర్ల కళ్ళకు!

క్వార్టర్సులోకి వెళ్ళే వరకూ ఆమెనే చూసి తర్వాత డ్యూటీ రూమ్‌లోకి అడుగుపెట్టాను.

ఎనిమిది గంటలయేసరికి రిలీవ్ చేయటానికి పగలు డ్యూటీ డాక్టర్లూ, హౌస్ సర్జన్లూ రావడంతో నెమ్మదిగా క్వార్టర్సుకి వెళ్ళాను.

స్నేహితులు ఏం అడుగుతున్నారో వాటికి నేనేం సమాధానం చెప్పానో నాకు గుర్తు లేదు.

స్నానం చేయాలనీ, టిఫిన తినాలనీ, కనీసం దుస్తులు మార్చుకొని మంచంమీద పడి నిద్ర పోవాలనీ కూడా ధ్యాసలేకుండా దిమ్మరపోయి కూర్చున్నాను.

మనసూ శరీరం కూడా వశంలో లేవు. గతించిన గతంలో అనుభూతిలో అవి పరవశించి పులకరించి పోతున్నాయి కాని వర్తమానంలోకి రావడానికి ఒప్పుకోటం లేదు.

అంతులేని ఆనందార్ణవంలో అలసటలేకుండా ఈ దినంతీపి జ్ఞాపకాల తాలూకూ హేంగోవర్‌లో ఆ రోజంతా గడిపాను.

ఆ పగలంతా ఒక క్షణంలా గడిచిపోయింది.

సాయంత్రం మళ్ళీ డ్యూటీ రూమ్‌కి చేరే వరకూ నిద్రా తిండీ లేకుండానే గడిపాను.

రెండో రోజున మెమోలు చాలా తక్కువగా వచ్చాయి వార్డులనుండి. క్రితం రోజు పడిన శ్రమలో పదోవంతు కూడా పని కలుగలేదు. క్షూడబలుక్కున్నట్టు కాంప్లికేషన్లు అన్నీ ఒకే రోజు వస్తాయి కాబోలు వార్డులలోని రోగులకు!

మామూలుగా అయితే క్రితంరోజు నిద్ర లేమికి రెండో రోజున గుర్రుపెట్టి నిద్రపోయి సేద దీర్చుకోవాల్సింది నేను!

కాని ఏ క్షణాన ఫ్లారెన్సు నుండి మెమో వస్తుందో అని వెయ్యికళ్ళతో చూస్తూ ఉన్న నా వంట్లో నరాలు టివ్వుమని లాగుతూ ఆరాట పడుతున్నాయి.

క్రితంరోజు వరకూ యౌవ్వన సహజమయిన కోర్కెలు బుట్టలో పెట్టిన త్రాచుల్లా ముడుచుకొని ఉన్నాయి.

రాత్రి ఫ్లారెన్సు పుణ్యమా అని అవి బుట్టలో నుండి బయటకు వచ్చి నాగస్వరాని కనుగుణంగా నాట్యం చేసి అలసిపోయాయి.

పడగ విప్పిన త్రాచులైనా లొంగుతాయేమో కాని వశం తప్పిన కోర్కెలను అణచడం సాధ్యం కాని పని అని తెలుసుకొన్నాను.

ఆ రాత్రంతా చాలా విచిత్రమయిన అనుభూతితో గడిపాను.

అంతులేని ఉద్రేకంతో ఎగసిపడే కోర్కెలను మాత్రం అదుపు చేయలేని అశక్త హృదయంతో అలసటను సరకుగొనని శరీరంతో, మరుక్షణంలో రాబోయే మధురానుభూతులకు స్వాగతం చెప్ప టానికి సిద్ధంగా ఉండిపోయాను.

అలా ఎంతసేపు డ్యూటీ రూమ్‌లో ఉన్నానో నాకే తెలియదు!

టైమ్ చూసుకొంటే మూడున్నర అయింది. ఎక్కడలేని ధైర్యం, తెంపు నాలో ప్రవేశించాయి.

ఫ్లారెన్సు వార్డుకేసి బయల్దేరి వెళ్ళాను. వార్డుబోయ్ బయట బల్లమీద గుర్రుపెడుతూ నిద్రపోతున్నాడు.

ఫ్లారెన్సు అంత రాత్రిలోనూ వార్డులోని రోగులకు ఏదో ఉపచర్య చేస్తూ తిరుగుతోంది. గబగబా పెద్ద పెద్ద అంగలు వేసుకొంటూ ఆమె దగ్గరకు వెళ్ళాను.

"మార్నింగ్, డాక్" అంది. ఆమె కళ్ళలో క్రితం రాత్రి కనపడ్డ మెరుపు లేదు.

"మార్నింగ్" అన్నాను.

నెమ్మదిగా ఒక్కో రోగి దగ్గరకూ వెళ్ళి, కవ్ బోర్డులు సర్ది, దుప్పటి సవరించి, దిండు పొజిషన్‌లో పెట్టి టెంపరేచర్ చార్టులు సర్దుతూ వచ్చింది. అలా కాలం గడుపుతూ ఉన్నదే కాని ఎంతకూ పక్కన ఉన్న డ్యూటీ రూమ్‌లోకి వచ్చే ప్రయత్నం చేయలేదు. పెంపుడు కుక్కలా ఆమె వెంటే ఒక్కో బెడ్ దగ్గరకూ వెళ్ళసాగాను.

అలా ఎంతసేపు ఉన్నానో గమనించలేదు. తెల్ల వారిన సూచనగా చెట్లమీద పక్షులు కలకలలు వినపడ్డాయి.

ఇంతలో మెమో బోయ్ వస్తే మెమో వచ్చిన వార్డుకు బయల్దేరాను అయిష్టంగా.

నా హృదయంలో ఏదో వెలితి, ఏదో చెప్పనలవి కాని బాధ.

ఫ్లారెన్సును చూస్తే కాని కుదుటబడదనుకొన్న హృదయం ఆమె వింత ప్రవర్తనతో ఖంగు తిన్నది.

అనుభవ శూన్యుడైనందున కాబోలు ఆమె ప్రవర్తనను నా పట్ల నమ్మక ద్రోహంగా భావించ సాగాను. నా మనసు పరిపరి భావాల సుళ్ళు తిరిగే కెలిడయోస్కోప్‌లా మారిపోయింది. ఫ్లారెన్స్‌పై మమకారం అంతలోనే ప్రశ్నార్థకంతో కూడిన ఆశ్చర్యం, అంతలోనే జుగుప్స, కోపం ఒక దాని వెంట ఒకటి పరిగెత్త సాగాయి నా మదిలో.

వార్డులో పని చూసుకుని వచ్చి డ్యూటీ రూమ్‌కు చేరాను. విచిత్ర మయిన ఆ మానసిక స్థితిలో ఎంతసేపున్నానో గమనించ లేదు. పరిచితమై మనసు నిండా ఉన్న ఫ్లారెన్సు ఆకారం రూమ్ ముందుగా పోతూంది నర్సెస్ క్వార్టర్స్ దిశగా.

ఇరవై నాలుగు గంటలలో ఎంత మార్పు! నిన్న

ఆమె వెళుతుంటే నా మనసెంత పొంగి పోయింది! ఈ రోజున నా మనసు నాకే అర్థం కాని ఒక పెద్ద ప్రశ్నార్థకం!

ఎనిమిది గంటలయేసరికి నెమ్మదిగా లేచి హౌస్ సర్జన్స్ క్వార్టర్స్‌కు వెళ్ళాను.

వెళ్ళానే కాని టిఫిన తీసుకోలేదు. స్నానం చేయలేదు. అచేతనంగా కుర్చీలో కూర్చుండి పోయాను.

రెండు గంటలకు సీనియర్ రూమ్ మేట్ రమణ వచ్చి భుజం మీద చేయి వేసే దాకా బాహ్య స్మరణ లేదు.

"ఏమిటి రా హను, అలా ఉన్నావు. జ్వరం ఏమయినా తగిలిందా ఏం?" అంటూ వచ్చి చేయి పట్టుకు చూశాడు. "ఏమీ లేదే! కొంప దీసి ప్రేమ జ్వరం ఏదైనా తగల్లేదు కదా? అది పైకి కనపడ దాయె!" అన్నాడు.

మౌనంగా ఉండిపోయిన నన్ను పరకాయించి చూసి— "మొదటి నైట్ డ్యూటీనుండి ఇలా అయి పోయావు. కొంప తీసి ఫ్లారెన్స్ తగల్లేదు గదా" అన్నాడు షెర్లాక్ హోమ్స్ పోజు పెట్టి.

"ఫ్లారెన్స అంటా వేమిటి?" అన్నాను ఎలాగో గొంతు పెగుల్చుకుని.

ఏదో లెక్క వేసుకున్నట్లుగా వేళ్ళు గుణించు కుని—"ఆ ఫ్లారెన్స్‌కుకూడా నైట్ డ్యూటీనా! అయితే ఇంకేం మొదటి నైట్ డ్యూటీ రోజున ఫ్లారెన్స్ ప్రేమకాటు తిన్నావు. ఆ విషం వళ్ళంతా పాకి ఇలా తయారయావు!" అన్నాడు రమణ.

గుడ్లు పెద్దవి చేసుకుని ఆశ్చర్యంగా చూస్తున్న నాతో చెప్పుక పోసాగాడు.

"ఫ్లారెన్సు సంగతి నీకు ముందుగా హెచ్చరించి ఉండాలిసింది. నాదే పొరపాటు. లేకపోతే ఇంత ఇంగు తిని ఉండే వాడివి కాదు! అయిపోయిందేమో అయి పోయింది. ఇక ఫ్లారెన్స్‌ను ఒక పీడకలగా మరిచి పోవటానికి ప్రయత్నం చెయ్యి. ఫ్లారెన్సుకు అందం, చలాకీతనం, తెలివి, చురుకూ, ఏమరకుండా విధి నిర్వహించాలనే తపనా అన్నీ ఉన్నాయి. అంత స్మార్ట్ నర్సు ఈ బాచ్‌లోనే మరొకరు లేరేమో? అయితే ఆమె మొదటి నైట్ డ్యూటీ రోజునే ఒక భయంకరమైన అనుభూతికి లోనయింది.

ఉత్సాహం ఉరవళ్ళు తొక్కే పదారేళ్ళ వయసులో నర్సు యూని ఫాం తగిలించుకుని నైట్‌డ్యూటీకి వచ్చింది ఫ్లారెన్స్. విచ్చీ విచ్చని మల్లెమొగ్గ లాంటి అందం ఆమెది. అప్పటి వరకూ ఆమె జీవితం ఆకాశంలో తెలి మబ్బుల మధ్య వెన్నెల్లో విహరించే రాయంచకన్న లాంటిది.

డ్యూటీ అసిస్టెంట్ నాగకృష్ణ వచ్చాడు రాత్రి పదకొండు గంటలకు. వార్డులో పనిఅయాక డ్యూటీ రూమ్‌లోకి వెళ్ళి కూర్చున్నా రిద్దరూ.

అరగంట అరగంటలో ఫ్లారెన్సులో ఉండే బెరుకు పోగొట్టాడు. అరచేతిలో వైకుంఠం చూపెట్టాడు. అంతవరకూ వూహించుకుని కూడా ఎరగని అనుభవా లను రుచి చూపించాడు.

త్వరలోనే రిజిస్ట్రార్ ఆఫీస్‌లో వివాహం చేసుకుందాం అంటూ బాసలు చేశాడు.

తెల్లవారింది. తీయని కల లాటి అనుభవాలను నెమరు వేసుకుంటూ తిండీ నిద్రా లేకుండా గడిపింది ఫ్లారెన్స్ ఆ రోజంతా.

సాయంత్రం డ్యూటీకి సిద్ధం అయింది—హృద యంలో కోటి వీణలు మోగుతుంటే.

రాత్రి ఎనిమిది గంటలకే వచ్చాడు నాగకృష్ణ వార్డుకు. ముభావంగా ఇవ్వవలసిన ఆదేశాలు ఇచ్చి వెళ్ళిపోయాడు.

పెచ్చరిల్లిపోతున్న కోర్కెలతో ఒద్దలవబోయే బెలూనులా ఉంది ఫ్లారెన్సు హృదయం యాంత్రి కంగా పనులు చేసుకుంటూ కాలం గడిపింది కొంత సేపు

తెల్లవాగుజామున తెంపుచేసి అసిస్టెంట్స్ డ్యూటీ రూమ్ వద్దకు వెళ్ళింది.

దగ్గరగా వేసి ఉన్న రూమ్ తలుపులను చిన్నగా టాప్ చేయబోయింది.

భయంకర విషనాగు బుస విన్నట్లుగా నిలబడి పోయింది మనసు విలవిలలాడుతూంటే.

లోపల నర్సు రంగమణి, నాగకృష్ణల ప్రేమ సుద్దులు నిశ్శబ్ద వాతావరణంలో బాగానే వినబడు తున్నాయి బయటకు.

ఇరవై నాలుగు గంటల ముందు తాను విన్న తేనె మాటలు, అనుభవించిన తీపి స్పందనలూ విష వృక్షం నీడను కాలనాగు బుసలుగా పరావర్తనం చెందినట్లు బాధపడిసాగింది ఫ్లారెన్సు.

డ్యూటీ అయాక క్వార్టర్సుకు వెళ్ళి దిగాలుపడి కూర్చున్న ఫ్లారెన్సుకు పక్క రూమ్‌లో సుధ, రమణి చెప్పుకొంటున్న మాటలు ఒక భయంకర సత్యాన్ని వెల్లడించాయి.

నాగకృష్ణన్ నిజంగా సార్థక నామధేయుడు కొత్త క్షేత్రాలలో విస్తారంగా విత్తనాలు వెదజల్లే వింత వ్యక్తి.

పదో సంవత్సరం వరకూ గొర్రెలు కాసుకుంటూ సేలం దగ్గర వూర్లో తిరిగే తమ్ముని మీద దయ దల్చి అతని అక్క తన వెంట తీసుకొని వచ్చి మధురలో తన దగ్గర ఉంచుకొని విద్యా బుద్ధులు చెప్పించింది.

చురుకైన బుర్ర అవడంతో చకచకా పైకి వచ్చి ఎం. బి. బి. యస్. లో చేరాడు. డాక్టర్ కోర్సులో చేరాడు గదా అని కూతురు రాణి నిచ్చి పెళ్ళి చేసింది అక్క. ఎం. బి. బి. యస్. పూర్తయే లోగా నలుగురు బిడ్డలకు తండ్రి అయ్యాడు. హౌస్ సర్జన్‌గా అడుగుపెడుతూనే పూలరంగడిలా తయా రయాడు.

దేవతలాంటి అక్క చేసిన మేలుకు ప్రతిఫలంగా పాలు పోసిన చేతినే కాటువేశాడు నాగ కృష్ణన.

భార్యవంక కన్నెత్తి చూడకుండా వీలున్నన్ని కొత్త రుచులు అనుభవించసాగాడు.

అదేమి విచిత్రమో, అతని మాటలు విన్న ఆడది పరవశించి వివశ అవుతుంది. ఎన్ని కల్లమాటలు చెప్తాడో అంతగా నమ్ముతుంది.

ఆడదాన్ని వశీకరించుకొనే శక్తి అతని దగ్గర పుష్కలంగా ఉంది.

అంతవరకూ చెప్పుకొన్న తర్వాత కొద్ది నిమిషాల సేపు సుధ, రమణి సాధారణంగా సభ్య స్త్రీలు వాడని ముతక తిట్లు తిట్టి నాగకృష్ణన్ మీద తమకున్న ఏహ్యభావాన్ని వ్యక్తపరచుకొన్నారు.

అంతా విన్నాక ఆ రోజు పొద్దుపోయే వరకూ ఎక్కిఎక్కి ఏడ్చింది ఫ్లారెన్స్.

చీకటిపడ్డాక గుండె రాయిచేసుకుని డ్యూటీకి బయల్దేరింది.

ఆ రోజు నుండి ఈ రోజు వరకూ మొదటి నైట్ డ్యూటీ హౌస్ సర్జనుగా వచ్చిన వ్యక్తిని టార్గెట్‌గా పెట్టుకొంటుంది. ఆ రాత్రి దివ్య రసానుభూతితో మునిగితేలే మధుర క్షణాలు పంచి ఇచ్చాక ఏమీ ఎరుగ నట్లు ముభావంగా ఉంటుంది మర్రోజు నుండి.

రోజు కొక వ్యక్తిని ప్రేమ శిఖరాల కెత్తి, మర్రోజు అగాధ కూపంలోకి తోసివేయడంలో ఆమెకేమైనా సంతోషం కలుగుతుందేమో తెలి యదు.

ఏమైనా నీవు లేటెస్ట్ విక్టిమ్‌వు—అంతే. అయితే ఒక విషయం. నర్సులంతా ఇలాగే ఉండరు. వారితో డాక్టర్ల సంబంధం కూడా ఇలాగే ఉండదు. వారి డ్యూటీ వారు చేస్తారు. మన డ్యూటీ మనం చేయాలి. అంతే.

రమణ చెప్పిన విషయాలు విన్నాక నిశ్చేష్టుడ నయాను.

ఇలాంటి అనుభవాన్ని పొందిన వాళ్ళలో నేను మొదటి వాడను కాను అనే ఆలోచన నా మనసును వూరడించింది.

కాలక్రమేణా ఫ్లారెన్సును మర్చిపోయాను.

"కాకపోతే ఆ మధుర క్షణాలకు గుర్తుగా ఇదుగో ఈ సిగరెట్ మిగిలింది" అన్నాడు హనుమంతరావు—వేళ్ళమధ్య కాలి నుసై పోతున్న సిగరెట్ వంక చూస్తూ!

గట్టిగా నిట్టూర్చి వార్డు వద్దకు దారితీశా రిద్దరూ! ✻

## ఏది పొరపాటు?

"మును నువ్వు పని చేసిన చోట్ల నుంచి నీ పనిని గురించిన పత్రాలేవైనా తెచ్చావా?" అని ఇంటర్వ్యూ కొచ్చిన గరభాస్తు దారుని అడిగాడు. కంపెనీ మేనేజర్.

"లేగండీ—అవన్నీ చింపి పారేశాను" అన్నాడు ఉద్యోగాన్వేషి.

"అలా చింపెయ్యడం తగ్గ పొరపాటు సుమా" అన్నాడు మేనేజర్.

"ఆ పత్రాల్లో వ్రాసిన ముక్కలు గనక మీరు చూసే ఉంటే, నే చేసింది పొరపాటనరు లెండి" అన్నాడతను.

- ప్రసీల్